క్లుప్తంగా

నేడు వలంటీర్లకు అవార్డుల ప్రదానం

జి.కొండూరు: గ్రామ వలంటీర్ల సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను శనివారం అందిస్తోందని ఎంపీడీఓ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. మండల పరిధిలోని 16 గ్రామ సచివాలయాలకు గానూ 298 మంది గ్రామ వలంటీర్లు ఉండగా గడ్డమణుగు గ్రామ వలంటీరు ప్రత్తిపాటి కల్యాణికి సేవా వజ్ర కింద రూ.45 వేలు, గడ్డమణుగు గ్రామానికి చెందిన విసంపల్లి ఇందు, వెల్లటూరుకు చెందిన రాజపు మాధవి, చెవుటూరుకు చెందిన పొన్న మమత, కవులూరుకు చెందిన మండాడపు దుర్గ, కంకిపల్లి నవీనకు సేవా రత్న కింద ఒక్కొక్కరికి రూ.30 వేలు, మిగిలిన 292 మందికి సేవా మిత్ర కింద రూ.15 వేల చొప్పున నగదు బహుమతులను అందజేస్తామని వివరించారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

ఇబ్రహీంపట్నం: డ్వాక్రా సంఘాల మహిళలకు రుణమాఫీలో భాగంగా వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం మధ్యాహ్నం జరుగుతుందని ఎంపీడీఓ ఉమాదేవి శుక్రవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, విజయవాడ ఎంపీ కేశినేని నాని, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ సర్నాల తిరుపతిరావు పాల్గొంటారని చెప్పారు.

● జి.కొండూరు: వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం స్థానిక జెడ్పీ హైస్కూల్లో శనివారం జరుగుతుంది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్, విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ సర్నాల తిరుపతిరావు, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారు.

రీజినల్ కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రైవేట్ స్కూల్స్, ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ రీజినల్ స్థాయి (ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాలు) కబడ్డీ పోటీల్లో కొండపల్లి క్రాంతి హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని పాఠశాల కరస్పాండెంట్ మురళీ మోహన్ శుక్రవారం తెలిపారు. సింగ్నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో జరిగిన పోటీల్లో జాతీయ క్రికెట్ కామెంటేటర్ కల్యాణ కృష్ణ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ మురళీ మోహన్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. విజేతలను అభినందించారు. మాజీ సర్పంచి వెనిగళ్ల అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో వెయ్యి మద్యం బాటిళ్లు స్వాధీనం

తిరువూరు: గంపలగూడెం మండలం లింగాలలో అక్రమంగా నిల్వ చేసిన తెలంగాణ మద్యాన్ని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. తిరువూరు ఎస్ఈబీ స్టేషన్లో ఈ కేసుకు సంబంధించిన వివరాలను అధికారులు వెల్లడించారు. 1000 మద్యం బాటిళ్లను తెలంగాణ నుంచి తెచ్చి లింగాలలోని ఒక నివాస గృహంలో నిల్వచేసిన నిందితుడిని అరెస్టు చేశామని, వీటి విలువ రూ.లక్ష వరకు ఉంటుందని తెలిపారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం తరలించకుండా ఎస్ఈబీ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.

బీసీ సంఘం నూతన కమిటీ ఎన్నిక

ఎ.కొండూరు: మండల బీసీ సంఘం నూతన కమిటీ ఎన్నికయిందని బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు దండుగుల శివశంకర్ శుక్రవారం తెలిపారు. ఎ.కొండూరులో గురువారం రాత్రి జరిగిన మండల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారని చెప్పారు. బీసీ సంఘం మండల అధ్యక్షుడిగా నీలపాల తిరుపతి రావు, ఉపాధ్యక్షుడిగా షేక్ సుభానీ, అధికార ప్రతినిధిగా పుచ్చకాయల కాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్గా మీసాల ఏసు, గౌరవ అధ్యక్షుడిగా పిన్నిబోయిన మల్లేశ్వరరావు ఎన్నికయ్యారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బత్తుల వెంకట్, ఎ. శ్రీనివాసాచారి, కె. నాగేశ్వరరావు, కె. చెన్నారావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం



నెమలి(గంపలగూడెం): నెమలి వేణు గోపాలస్వామి ఆలయంలో శుక్రవారం 66వ విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం, రథసప్తమి ప్రత్యేక కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గోపాలాచార్యులు, అర్చక బృందంచే విశ్వక్సేన పూజ, పుణ్యాహ వచన, అఖండ దీపారాధన, అగ్ని ప్రతిష్టాపన తదితర పూజాదికాలు జరిపారు. అనంతరం గోపాల లక్ష్మీ, సుదర్శన హోమం, సూర్యనారాయణ మహా మంత్ర హోమాలను నిర్వహించారు. లోక శాంతికై మహామంత్ర హోమం చేసి పూర్ణాహుతితో ప్రత్యేక కార్యక్రమాలను ముగించారు. ఆయా కార్యక్రమాలలో 45 మంది దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ నూతక్కి వెంకట సాంబశివరావు, భక్తులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి





మైలవరంలో చెక్కు అందజేస్తున్న ఎంపీ కేశినేని నాని, చిత్రంలో తిరుపతిరావు తదితరులు ; సభలో మాట్లాడుతున్న ఎంపీ నాని

- విజయవాడ ఎంపీ కేశినేని నాని
- ఆసరా నమూనా చెక్కు అందజేత

మైలవరం: పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి పాలన చేస్తున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. మైలవరం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఎంపీ కేసినేని నాని మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి జరిగిందన్నారు. మైలవరం మండలంలోని అక్కచెల్లెమ్మలు 1,186 మంది లబ్ధిదారులకు నాలుగో విడతగా ఆసరాకు సంబంధించి రూ.9.23 కోట్ల విలువ చేసే చెక్కులను అందజేశారు. మహిళల అభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఎన్నో పథకాలు వారికి అమలు చేస్తున్నారని వివరించారు. మైలవరం నియోజకవర్గానికి ఇన్చార్జిగా ఒక సామాన్య వ్యక్తి సర్నాల తిరుపతిరావును ముఖ్యమంత్రి నియమించారని, ఇది వైఎస్ జగన్మోహన్రెడ్డి సామాన్యులకు ఇస్తున్న భరోసా అని చెప్పారు. అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నారని వివరించారు. మీకు మంచి జరిగితేనే ఓటు వేయమని ప్రజలను కోరిన దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి అని, ఆయనను మరోసారి అందరూ ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ సీపీ విజయానికి నాయకులు, పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. మైలవరం నియోజకవర్గ ఇన్చార్జి సర్నాల తిరుపతిరావు మాట్లాడుతూ ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరేలా ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వెల్నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నారని వివరించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన

రెడ్డిగూడెం: దేశ వ్యాప్త గ్రామీణ సమ్మెలో భాగంగా రెడ్డిగూడెంలో రైతులు, కార్మికులు వ్యవసాయ కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు కొండపల్లి పరమేశ్వరరావు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఎం. మాధవరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నల్ల చట్టాలు తీసుకువచ్చిం రైతులను సంక్షోభంలోకి నెట్టిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేయడం, కార్మిక చట్టాలను మార్చి కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టడం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడవర్తి వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు ఉయ్యూరు కృష్ణారెడ్డి, బాబు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి..

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు సీఐటీయూ, రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని కోరారు. కొండపల్లి ఐడీఏ, స్థానిక కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల వద్ద కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా, మండల కార్యదర్శులు ఎస్సీహెచ్ శ్రీనివాస్, ఎం.మహేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మల్నీడు యలమంద రావు, ఎంసీపీఐయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గొల్లపూడి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



నూజివీడులో నిరసన తెలుపుతున్న రైతు, ప్రజా సంఘాల నాయకులు

● చాట్రాయి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను సాగనంపుదామని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనంద్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా చాట్రాయిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో జంతర్మంతర్ వద్ద రైతులు చేస్తున్న ఆందోళనలో పోలీసులు రైతులపై రబ్బర్ బుల్లెట్లు ప్రయోగించడం దారుణమన్నారు. కార్యక్రమంలో దర్గం పుల్లారావు, సామాజిక చైతన్య వేదిక మండల కన్వీనర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● విస్సన్నపేట: దేశవ్యాప్త గ్రామీణ బంద్ సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్లో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వి. నాగరాజు, సీఐటీయూ మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, కేవీపీఎస్ జిల్లా నాయకుడు మేకల జ్ఞానరత్నం పాల్గొన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి మర్సకట్ల త్యాగరాజు, ముఠా యూనియన్ నాయకులు నాంచారయ్య, వెంకటేశ్వరరావు, దానయ్య తదితరలు పాల్గొన్నారు.

● గంపలగూడెం: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు నిరసన వ్యక్తం చేస్తూ రైతు కార్మిక సంఘాలు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం బంద్ నిర్వహించాయి. గంపలగూడెం, తోటమూల, పెనుగొలను, ఊటుకూరు తదితర గ్రామాల్లో ఆయా సంఘాల ప్రతినిధులు ప్రదర్శనగా వెళ్లి ప్రభుత్వ కార్యాలయాలను, పాఠశాలలను, బ్యాంకులను మూసి వేయించారు. గంపలగూడెంలో తిరువూరు మధిర ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు.

● నూజివీడు: కేంద్ర ప్రభుత్వం రైతు చట్టాలను, కార్మిక చట్టాలను కాల రాస్తోందని, నరేంద్ర మోదీ అవలంభిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పకొట్టేందుకు ప్రజలందరూ కదలిరావాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం పట్టణంలోని పెద్దగాంధీ బొమ్మ సెంటర్లో శుక్రవారం రైతు సంఘాలు, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకటరామారావు, రైతు సంఘం సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి బీడీ రవికుమార్, సీపీఐ ఎంఎల్ నాయకులు డి. హరినాథ్, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, సీఐటీయూ నాయకులు జి. రాజు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

తిరువూరు నియోజకవర్గ ఇన్చార్జి స్వామిదాసు

తిరువూరు: రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ అధిష్టానం ఇచ్చిన ఆదేశాల మేరకు నాయకులు, కార్యకర్తలు పని చేయాలని తిరువూరు నియోజకవర్గ ఇన్చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. స్థానిక సూర్యా ఫంక్షన్ హాల్లో శుక్రవారం జరిగిన తిరువూరు నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రమశిక్షణకు మారుపేరైన వైఎస్సార్ సీపీలో సొంత నిర్ణయాలకు తావులేదని, పార్టీ నిర్ణయమే శిరోధార్యమని చెప్పారు. కింది స్థాయిలోని సామాన్య కార్యకర్త నుంచి ప్రతి ఒక్కరూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రెండోసారి ఏర్పాటు చేయడానికి అవసరమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. బూత్ కమిటీలు పటిష్టంగా ఉంటేనే ఎన్నికల్లో సునాయాసంగా గెలుపునకు అవకాశం ఉంటుందన్నారు. నియోజకవర్గ బూత్ కన్వీనర్ రేగళ్ల మోహన రెడ్డి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్వామిదాసు

విద్యార్థులు పరీక్షల భయాన్ని వీడాలి

గంపలగూడెం: త్వరలో నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావద్దని మోటివేషనల్ స్పీకర్ కండవల్లి సుధాకర్ అన్నారు. గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన మోటివేషనల్ క్లాసులో ఆయన పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాయలన్నారు. ఆందోళన, మానసిక ఒత్తిడికి గురైతే విద్యార్థులు జ్ఞాపకశక్తిని కొంత కోల్పోతారన్నారు. తద్వారా తెలిసిన ప్రశ్నలకు కూడా జవాబు రాయలేని పరిస్థితిని ఎదుర్కొంటారన్నారు. జవాబులను గుండ్రంగా అర్థమయ్యే రీతిలో రాయాలని సూచించారు. మరో మోటివేషనల్ స్పీకర్ పూర్ణిమ విద్యార్థులకు పరీక్షలు రాసే విధానంలో మెలకువలను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. కిరణ్కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్

బ్యాంక్ సేవలను వినియోగించుకోండి

సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ఏఎస్ ప్రసాద్

తిరువూరు: జాతీయ బ్యాంకులకు ధీటుగా సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ఆన్లైన్ సేవలను విస్తృత పరుస్తోందని ఆ బ్యాంక్ చైర్మన్ అన్న సత్యనారాయణ ప్రసాద్ అన్నారు. తిరువూరు సప్తగిరి గ్రామీణ బ్యాంక్ శాఖను శుక్రవారం నూతన భవనంలో ప్రారంభించిన సందర్భంగా జరిగిన ఖాతాదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ సేవలను తమ బ్యాంకులలో ఇటీవల ప్రవేశపెట్టామని చెప్పారు. ఇతర బ్యాంకుల కంటే డిపాజిట్లపై అధిక వడ్డీ ఇవ్వడంతో పాటు బంగారు ఆభరణాలపై అతి తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తున్నామని తెలిపారు. గుడివాడ, విజయవాడ రీజినల్ మేనేజర్లు శివరాం ప్రసాద్, బ్రహ్మయ్య, బ్రాంచి మేనేజరు అనిల్కుమార్ పాల్గొన్నారు.



తిరువూరు సప్తగిరి గ్రామీణ బ్యాంక్ శాఖ భవనాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ ప్రసాద్

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

మునునూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సకల సౌకర్యాలు, సమస్త హంగులతో జగనన్న కాలనీలు రూపుదిద్దుకుంటున్నాయని గుళ్లపూడి సర్పంచ్ ఆర్.శ్రీదేవి అన్నారు. శుక్రవారం గ్రామంలోని జగనన్న లేఅవుట్లో విద్యుత్ స్తంభాలు, లైన్ల పనులను ఆమె ప్రారంభించారు. ఉప సర్పంచ్ పద్మజ, నాయకులు ఆర్.శ్రీనివాస్, వి.రాంబాబు, విద్యుత్ శాఖ, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

ముసునూరు: మండలంలో పలు అభివృద్ధి పనులను నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం ప్రారంభిస్తారని ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి తెలిపారు. రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం, సూరేపల్లి, బాసవరప్పాడు, గుళ్ళపూడి చెక్కపల్లి, వలసపల్లి, బలివే, వేల్పుచర్ల, పెదపాటివారిగూడెం, ముసునూరు, కొర్లగుంటలో సచివాలయాలు, ఆర్బీకేలు, వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకులు, వాటర్ పైపులైన్లను ప్రారంభిస్తారని వివరించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు

నూజివీడు: మద్యం తాగి వాహనం నడిపితే వారి డ్రైవింగ్ లైసెన్స్ను ఆరు నెలల పాటు రద్దు చేయడంతో పాటు కారాగార శిక్ష అనుభవించాల్సి ఉంటుందని నూజివీడు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి. నాగమురళి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం నూజివీడు ఆర్టీఏ కార్యాలయంలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యాసంస్థల బస్సు డ్రైవర్లకు, నూతన లైసెన్సుదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నూజివీడు: 35వ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులు ఏలూరు జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఏలూరులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రశంసా పత్రాలను, సర్టిఫికెట్లను అందుకున్నారు. సీహెచ్ నిఖిల ప్రథమ, వర్షిణి ద్వితీయ, ఎస్. సాహిన తృతీయ స్థానంలో నిలిచారు. ఏలూరు డెప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఎస్. శాంత కుమారి చేతుల మీదుగా వారు బహుమతులు అందుకున్నారు. విజేతలను పాఠశాల హెచ్ఎం వీవీఎన్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇరువురు వలంటీర్లకు సేవా వజ్ర

తిరువూరురూరల్: మండలంలోని ఇద్దరు వలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వ సేవా వజ్ర పురస్కారం లభించిందని ఇన్చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన వలంటీర్లు సంగొంది అరుణ, మాచిబోయిన శ్రీలక్ష్మిలకు సేవా వజ్ర, మందా విజయరాణి (వామకుంట్ల), మేడిపల్లి భవాని (కొత్తూరు), షేక్ షరీఫా బేగం (వావిలాల), శ్రీరామదాసు నాగమల్లేశ్వరి(మునుకుళ్ల-2), అరిసేపల్లి రవికుమార్ (ఎర్రమాడు)లకు సేవా రత్న పురస్కారాలు లభించాయని చెప్పారు.

నేడు తిరువూరులో బాలోత్సవం

తిరువూరు: తిరువూరులో బాలోత్సవ కార్యక్రమం శనివారం ఉదయం 10 గంటలకు తిరువూరు శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో జరుగుతుందని ఆహ్వాన కమిటీ తెలిపింది. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. సాయంత్రం విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామన్నారు.

రేపు మధుమేహ వైద్య శిబిరం

తిరువూరు: జన విజ్ఞాన వేదిక, జీబీఆర్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో ఈ నెల 18న తిరువూరులో మధుమేహ రోగులకు ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తామని జేవీవీ పట్టణ అధ్యక్షుడు పాపారావు తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి తిరువూరు ఫ్యాక్టరీ సెంటర్లోని నాగార్జున స్కూల్ ఆవరణలో జరిగే వైద్యశిబిరంలో వైద్య నిపుణులు రోగులను పరీక్షించి అవసరమైన మందులను పంపిణీ చేస్తారని తెలిపారు.

ఘనంగా వార్షికోత్సవం

వినగడప(గంపలగూడెం): మండలంలోని వినగడప పంచముఖ సుందర హనుమత్ పీఠంలో 19వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పీఠం అర్చకుడు ఆరిపిరాల అప్పయ్యశాస్త్రి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం నిర్వహణకు అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు
- చెత్త సేకరణకు ఎలక్ట్రికల్ ఆటోలు ప్రారంభం

నూజివీడు: మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణకు, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేందుకు మున్సిపాలిటీకి ప్రభుత్వం సరఫరా చేసిన ఆరు ఎలక్ట్రికల్ ఆటోలను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత నవంబర్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి నూజివీడు వచ్చిన సందర్భంలో పట్టణ అభివృద్ధికి రూ.16 కోట్లు మంజూరు చేశారన్నారు. ఆ నిధులతో త్వరలోనే సీసీ డ్రెయినేజీలు, ఇతర అభివృద్ధి పనులను చేపట్టనున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. దీనిలో భాగంగానే ఎమ్మార్ అప్పారావు కాలనీలో 12 వరకు సిమెంట్ రోడ్లు నిర్మించామన్నారు. పట్టణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కోనేరుపేట, ఎమ్మార్ అప్పారావు కాలనీల్లో ఏర్పాటు చేసి వాటికి రూ.1.60 కోట్లతో శాశ్వత భవనాలను నిర్మించామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని ఆదరిస్తే అభివృద్ధి మరింత పరుగులు పెడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ రామిశెట్టి త్రివేణీ దుర్గ, కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి, వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కో-ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



ఎలక్ట్రికల్ ఆటోలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

బీసీలకు సీఎం జగన్ ప్రాధాన్యం

మైలవరం ఇన్చార్జి తిరుపతిరావు

మైలవరం: బీసీలకు ప్రాధాన్యత ఇస్తూ మైలవరం నియోజకవర్గ ఇన్చార్జిగా బీసీని నియమించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డిదే అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జి సర్నాల తిరుపతిరావు అన్నారు. మైలవరంలో వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం సీఎంఆర్ కల్యాణ మండపంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. తిరుపతిరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేసి వైఎస్సార్ సీపీని గెలిపించి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని చెప్పారు. సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి పాలనలో అన్నివర్గాలకు సముచిత స్థానం కల్పించడంతో పాటు బడుగు, బలహీన వర్గాలకు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని చెప్పారు. పింఛన్లు, రేషన్ బియ్యం ఇంటి వద్దకే వస్తున్నాయని తెలిపారు. అక్కచెల్లెమ్మలకు చేయూత, ఆర్బీకేల ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నారని వివరించారు. ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ ఎన్టీఆర్ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జె. గంగాధరరావు, సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి, వైస్ ఎంపీపీ షేక్ రహీం తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు

భక్తిశ్రద్ధలతో రథసప్తమి పూజలు

తిరువూరు: రథసప్తమి సందర్భంగా స్థానిక షిర్డీ సాయి కల్యాణ మండపంలో శుక్రవారం మహాసౌర అరుణ త్రిచ నమస్కారాలు, హోమాలు నిర్వహించారు. వేద పండితులు కేతముక్కల శ్రీనివాసశాస్త్రి, వెంకట సంతోష్కుమార్ శర్మల ఆధ్వర్యంలో జరిగిన రథసప్తమి పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. షిర్డీ సాయి భక్త సమాజం అన్నదానం నిర్వహించింది.

● గంపలగూడెం: రథసప్తమి పర్వదినాన్ని మండలంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యభగవానునికి సూర్య నమస్కారాలతో విశేష పూజలు చేశారు. సంప్రదాయబద్ధంగా ఆవు పిడకలపై పొంగలి తయారుచేసి సూర్య భగవానునికి సమర్పించారు. పలు పాఠశాలల్లో సూర్య నమస్కారాలతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సూర్య నమస్కారాల వల్ల కలిగే ప్రయోజనాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. మెట్టగుట్ట శేషాచల శ్రీనివాసస్వామి ఆలయంలో సూర్యప్రభ వాహనంపై స్వామిని ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. భక్తులు పాల్గొన్నారు. మండలంలోని పలు ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.



మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస స్వామి ఆలయంలో సూర్య ప్రభ వాహనంపై స్వామి వారు



తిరువూరులో సౌరహోమం నిర్వహిస్తున్న వేద పండితులు

మైలవరంలో దొంగల హల్చల్

రెండు వైన్షాపులు, విజయ డైరీలో చోరీ

మైలవరం: మైలవరంలో గురువారం రాత్రి దొంగలు హల్చల్ చేశారు. స్థానిక నూజివీడు రోడ్డులోని ప్రభుత్వ వాక్ ఇన్ వైన్ స్టోర్, విజయవాడ, భద్రాచలం రోడ్డులో ప్రభుత్వ వైన్షాపు, పక్కనే ఉన్న విజయ డైరీ పార్లర్, స్వీట్ షాపులోను గురువారం అర్ధరాత్రి దొంగలు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. గత రాత్రి దొంగలు షాపులపైన ఏర్పాటు చేసిన ఇనుప రేకులను కట్టర్తో కట్చేసి షాపులోనికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. నూజివీడు రోడ్డులోని ప్రభుత్వ వాక్ఇన్ వైన్ స్టోర్లో రూ.2,03,000 నగదు, భద్రాచలం రోడ్డులోని పశువుల ఆస్పత్రి వద్ద గల విజయ డైరీ మిల్క్ షాపులో రూ.30 వేల నగదు చోరీకి గురైనట్లు షాపుల్లో పని చేస్తున్న సిబ్బంది తెలిపారు. ఒకేసారి మూడు షాపుల్లో దొంగలు చోరీలు చేయడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు ఘటనా స్థలాలను పరిశీలించారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.



చోరీ జరిగిన వైన్షాపును పరిశీలిస్తున్న పోలీస్ సిబ్బంది

వైభవంగా భావనారుషి స్వామి వార్ల కల్యాణం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): భద్రావతి సమేత భావనారుషి స్వామివార్ల కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. కొండపల్లి పద్మశాలీపేటలో స్వామి వార్ల ఆలయం వద్ద జరిగిన వేడుకల్లో పలువురు దంపతులు పీటలపై కూర్చుని వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ పాలకవర్గ కమిటీ గౌరవాధ్యక్షుడు స్వర్గం పుల్లారావు, కార్యదర్శి చెరుకు లక్ష్మీ నరసింహారావు, పట్టణ పెద్దలు పాల్గొన్నారు.

